## అధికార నందివాహనంపై సోమస్కంధమూర్తి



తిరుపతి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: కపిలేశ్వర ఆలయంలో స్వామివారికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు బుధవారం రాత్రి సోమస్కంద మూర్తి ఎంతో ప్రియమైన అధికార నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. కైలాసంలో మెడలో మువ్వల దండలతో, కాళ్ళకు గజ్జెలతో మనోహరాకారంతో బంగారు కొమ్ములతో అలరారే నంది భవుడికి నిత్యవాహనం. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత స్వామివారు నగర వీధుల్లో ఊరేగారు. ఉదయం కపిలేశ్వరస్వామివారు తిరుచ్చివాహనంపై భక్తులను కటాక్షించారు. వాహనసేవల్లో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ పార్థసారధి, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు. రాత్రి ఆలయం వద్ద అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


## వేడుకగా లక్ష్మీకాసులహారం శోభాయాత్ర

తిరుమల, ఫిబ్రవరి 15ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామికి గరుడసేవరోజుఅలంకరించే లక్ష్మీకాసులహారాన్ని బుధవారం ఉదయం తిరుమల ఆలయం నుండి శోభాయాత్రగా చంద్రగిరి శ్రీనివాసమంగాపురం ఆలయానికి తీసుకెళ్ళారు. అక్కడ స్వామివారికి బుధవారం రాత్రి జరిగిన గరుడసేవలో స్వామివారికిఅలంకరించారు.



# గరుడ వాహనంపై శ్రీనివాసుడి విహారం

### పోటెత్తిన భక్తజనసందోహం..పోలీసుల పటిష్ట భద్రత



చంద్రగిరి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: శ్రీనివాస గోవిందా శ్రీవెంకటేశ గోవిందా అంటూ భక్తజనుల గోవింద నామస్మరణల నడుమ శ్రీనివాసుడు తన నిత్య వాహనమైన గరుడ వాహనంపై అధిష్టించి భక్తులకు దర్శనమిచ్చారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తిని గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. ఆలయ కంకణ భట్టార్ బాలాజీ రంగాచార్యులు వాహన విశిష్టతను వివరిస్తూ శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధానమైన గరుడ వాహన సేవలో స్వామివారిని వీక్షించడం ద్వారా మోక్షం సిద్ధి స్తుందని భక్తుల విశ్వాసమన్నారు. బ్రహ్మోత్సవాలలో గరుడ వాహనసేవకు పోటెత్తిన భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు, తోపులాటలు లేకుండా తిరుపతి వెస్ట్ డిఎస్పీ నరసప్ప, సిఐ ఓబులేష్ పర్యవేక్షణలో ఎస్‌ఐలు వంశీధర్, హిమబిందు, ఇతర సిబ్బంది, ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి దంపతులు, టిటిడి పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జెఇఓలు వీరబ్రహ్మం, సదాభార్గవి, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ ముని చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు పార్థసారధి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## మోహినీ అవతారంలో కళ్యాణ వెంకన్న

శ్రీ కళ్యాణవెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు బుధవారం ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో పల్లకిపై విహరించగా, తిరుచ్చిపై చిన్నికృష్ణుడి అలంకరణలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కంకణభట్టార్ బాలాజీ రంగాచార్యులు వాహన విశిష్టతను వివరిస్తూ మోహినీ అవతారంలో స్వామివారిని దర్శించుకోవడం ద్వారా మనలోని మోహాలు తొలగి సర్వం శ్రీహరిమయం కాగలదని పురాణాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ టి.వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు పార్థసారిధి, అర్చకులు నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగా ఆండాళ్ అమ్మవారి మాలలు ఊరేగింపు**

కళ్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం తిరుపతి గోవిందరాజస్వామి వారి ఆలయం నుండి ఆండాళ్ అమ్మవారి మాలలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా అశేష భక్తులతో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన గోదా కళ్యాణయాత్ర అంబారీపై మాలలను తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు జరపించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయంగార్, శ్రీశ్రీశ్రీ చిన్న జియ్యంగార్, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ ముని చెంగల్రాయలు, తదితరులు పాల్గొన్నారు.



**అంగరంగ వైభవంగా శోభాయాత్ర**

కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సంప్రదాయానుసారం లక్ష్మీకాసులహారం జెఈఓ వీరబ్రహ్మం ఆలయ అర్చకులకు అందజేశారు. తిరుమల శ్రీవారి ఆలయం నుండి ఆభరణాలను అందించడం ఆనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు.

# భూతవాహనంపై కైలాసనాధుడు
# శుక వాహనంపై మనోణి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల ఊరేగింపుల్లో ఈ ఏడాది అలంకారాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది. బుధవారం రాత్రి ఉత్సవంలో స్వామి అమ్మవార్ల అలంకారాలను తిలకించిన భక్తులు మంత్రముగ్ధులయ్యారు. కైలాసనాధుడు భూతనాధుడని చెబుతారు. ఈ నేపథ్యంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఒక్కొక్కరోజు ఒక్కొక్క వాహన సేవను నిర్వహిస్తారు. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి ముక్కంటీశుడు భూతవాహనంపై, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు శుక వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. స్వామి భూత వాహనంపై ఆశీనుడు కాగా పరిచారకులు వింజామరలు వీస్తుండగా తన దివ్య తేజాన్ని తన భక్తులకు దర్శనమిస్తూ కైలాసనాధుడు పురవీధుల్లో దర్శనమిచ్చారు. భోళాశంకరుడు భూతనాధుడు కాబట్టి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండోతిరునాళ్ళలో రాత్రి ఆయన్ను భూత వాహనంపై ఊరేగిస్తారు. అలాగే అమ్మవారిని శుక వాహనంపై ఊరేగించారు. స్వామిఅమ్మవార్లను ఎంతో చక్కగా అలంకరించి వాహనాల మండపం వద్దకు చేర్చారు. ఉత్సవం సకాలంలో ప్రారంభం అవుతుండటంతో భక్తులు విశేషసంఖ్యల్లో హాజరై స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. సుమారు రెండున్నర గంటల పాటు ఉత్సవం సాగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ను ఎఎస్‌ఐ జనార్థన్‌నాయుడు, వెంకటేశ్వర్లు బైపాస్‌రోడ్డు మీద నుంచి మళ్ళించారు. ఉత్సవాన్ని ఎంతో మంది భక్తులు పాల్గొన్నారు. ఉభయదాతలు హరిజన గిరిజన సంఘం నాయకుడు పసల పెంచలయ్య వారి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**సైరన్ మోగిందో ఉత్సవం**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు సంబంధించి గతంలో సంకేతంగా బారీ ఎత్తున బాణ సంచాను కాల్చేవారు. దాంతో పట్టణ నలుదిక్కుల నుంచి జనం కదలితరంగాల్లా కదలి వచ్చేవారు. ఒక్కొక్క ప్రాంతానికి చెందిన జనం మహిళలు ఒక్కొక్క చోట కేంద్రీకృతమై స్వామి అమ్మవార్లను దర్శించుకునే వారు. బాణా సంచాపై నిషేధం విధించటంతో ఉత్సవాల్లో అనుమతించటం లేదు. దాంతో రాత్రి ఉత్సవం సమయం తెలియక తికమక పడుతున్నారు. ఈ సమస్యను సమీక్షల్లో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి దృష్టికి తీసుకురాగా ఈ ఏడాది ఆయన అధికారులతో చర్చించి 'సైరన్'ను ఏర్పాటు చేశారు. ఉదయం రాత్రి ఆలయంలో ఉత్సవం బయలుదేరే ముందు సైరన్ మోగిస్తున్నారు. ఇది ఉత్సవానికి సంకేతంగా జనం పట్టణ నలుదిక్కుల నుంచి కదలి వస్తున్నారు. ఉత్సవాన్ని అలంకారమండపంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ వికెసాగర్‌బాబు పూజలు నిర్వహించి ఉత్సవానికి కదలించారు. వాహనాల మండపం వద్ద వాహనాలపై ప్రతిష్టించి ప్రారంభించారు.

## అసైన్మెంట్ భూముల గుర్తింపు ప్రక్రియ వేగవంతం : కలెక్టర్



చిత్తూరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: దళితవాడల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు సంబంధించి అవసర మైన స్థలాలను గుర్తించి పంచాయతీలకు అప్పగించాలని కలెక్టర్ తహసిల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి బుధవారం కలెక్టర్ హరినారాయణన్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్‌ఓ రాజశేఖర్‌లతో కలిసి తహసిల్దార్లు, విఆర్‌ఓలతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 187 దళితవాడలకు సంబంధించి స్మశాన స్థలాలను అప్పగించాల్సి వుందన్నారు. పెండింగ్‌లో వున్న స్థలాలను సత్వరం గుర్తించి తహసిల్దార్లు పంచాయతీలకు అప్పగించడానికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే 22ఎ కింద పలు దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయని, అసైన్మెంట్ చట్టం ప్రకారం పెండింగ్‌లో వున్న దరఖాస్తులను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జిల్లాలో పలు ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో చిత్తూరు, పలమనేరు, నగరి ఆర్డీఓలు డాక్టర్ రేణుక, శివయ్య, సృజన, డిఐలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

## ఇస్రో గ్రంథాలయాల పనితీరు భేష్

**- రెండురోజుల పాటు షార్‌లో ఇస్రో కేంద్రాల లైబ్రేరియన్ల సమావేశాలు**

**- రాకెట్ ప్రయోగ కేంద్రాలను సందర్శించిన బృందం**



శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోకు సంబంధించిన వివిధ కేంద్రాల గ్రంథాలయాల అధికారులు రెండురోజుల పాటు షార్‌లో పర్యటించారు. ఇంటర్ సెంటర్ ఇస్రో లైబ్రరీ ప్రొఫెషనల్స్ మీట్ కార్యక్రమంలో పలువురు షార్ అధికారులు కూడా పాల్గొన్నారు. బుధవారం సుమారు 50 మందితో కూడిన ఇస్రో కేంద్రాల గ్రంథాలయాల బృందం శ్రీహరికోటలోని మొదటి, రెండవ రాకెట్ ప్రయోగ వేదికలను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక బ్రహ్మప్రకాష్ హాల్లో జరిగిన కార్యక్రమంలో చెన్నైలోని ఐఐటి లైబ్రేరియన్ డాక్టర్ మహేంద్ర జాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రంథాలయాల నిర్వహణకు ఐఐటి తరపున ఎటువంటి సాయమైనా అందిస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. అసోసియేట్ డైరెక్టర్ ఆర్.వెంకట్రామన్ తన ప్రసంగంలో వివిధ ఇస్రో కేంద్రాల్లోని గ్రంథాలయాల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. డిప్యూటీ డైరెక్టర్ ఆర్.సెంథిల్‌కుమార్ షార్‌లోని లైబ్రరీ నిర్వహణను ప్రశంసించారు. శ్రీహరికోట లైబ్రరీ హెడ్ కెవి రాధాకృష్ణన్, అహ్మదాబాద్‌లోని ఎస్‌ఎసి కేంద్రం హెడ్ రచనా పట్నాయక్, బెంగళూరులోని యుఆర్‌ఎస్‌సి కేంద్రం హెడ్ మాలతి, అహ్మదాబాద్ సిఆర్‌ఎల్ లైబ్రరీ హెడ్ నిశిత, ఎంఎస్‌ఎ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇస్రో గ్రంథాలయాల్లో ఉన్న వివిధ సమాచార సేవలను వినియోగదారులకు ఏ విధంగా అందించవచ్చన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ నిర్వాహకులకు బహుమతులు పంచిపెట్టారు.

## సవాళ్ళను ఎదుర్కోలేకే వికృత చేష్టలు

**- వైసీపీ మహిళా నేతల ఆగ్రహం**



నగరి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: టీడీపీ మహిళలు, నాయకులు చీర, సారె అంటూ మంత్రి రోజా నివాసం వద్ద మంగళవారంచేసిన రాద్ధాంతంపై నియోజకవర్గానికి చెందిన వైసీపీ పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం టవర్‌క్లాక్ సెంటర్ వద్దకు చేరుకున్న వారు పార్టీ మహిళా నేతలు, నాయకులు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, నగరి ఇన్‌చార్జి భానుప్రకాష్‌లపై విరుచుకుపడ్డారు. లోకేష్, భానుప్రకాష్ ఫ్లెక్సీలను చెప్పులతో కొట్టి వాటిని కాళ్ళతో తొక్కడంతో పాటు వాటిని కాల్చి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ పుత్తూరు సభలో లోకేష్‌చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంత్రి రోజా ఆయనకు హుందాగా సవాల్ విసిరారన్నారు. ఆస్తులపై ఇద్దరు సీబీఐ విచారణ చేసుకుందాం ఎవరు కష్టపడి సంపాదించారో...? ఎవరు దోచుకుని సంపాదించారో...? తేలిపోతుందని ఒక సవాల్ విసరగా టీడీపీ మేనిఫెస్టో తెండి నేను వైసీపీ మేనిఫెస్టో తెస్తా ఎరి ఎన్ని హామీలు నెరవేర్చారు. ప్రజలకు ఎవరు ఎంత సంక్షేమం అందించారో తేల్చుకుందాం అని మరో సవాల్ విసిరారన్నారు. మంత్రి చెప్పినట్లు ఆ పార్టీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే సవాల్‌ను స్వీకరించాలి కాని ఆడవాళ్ళతో ఇంటికి చీరలు పంపించి వెనుక వైపు నుంచి అక్రమంగా చొరబడుతుందుకు ప్రయత్నించడం, ఆమె నివాసం వద్ద రాద్ధాంతంచేయడం లాంటి వికృత చేష్టలు టీడీపీ నాయకుల అసమర్థతకు నిదర్శనమన్నారు. వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చాక నగరిలో ఇప్పటి వరకు ఎవరిపైనా రాజకీయ కేసులు పెట్టకపోవడమే మంత్రి రోజా మంచితనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## లోకేష్ పాదయాత్రలో మహిళలు బ్రహ్మారథం



కేవీబీ పురం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం కేవీబీ పురం మండలంలో జరిగింది. ఈ పాదయాత్రలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అడుగడుగునా మంగళహారతులు, కొబ్బరికాయలు, గజమాలతో, పూల వర్షం కురిపించారు. రోడ్డుకిరువైపులా జనసందోహంతో ఆయనకి స్వాగతం పలికారు. గ్రామ పంచాయతీల్లో భారీ ఎత్తున టపాసులు, ఒక టన్ను పూలు వెదజల్లుతూ ఆయనకి స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ అవసరం సురేష్‌రెడ్డి భారీ ఎత్తున టపాసులు పూలమాలలు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ పొన్నూరు బాలాజీ, మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, టీడీపీ సీనియర్ నాయకుడు శివరావ్, గ్రామస్థులు వెంకట్రామయ్య, మాజీ సర్పంచ్ అవసరం సురేష్‌రెడ్డి, నాయకులు రామాంజనేయులు, మునస్వామి యాదవ్, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆక్వా రైతుల సుస్థిర అభివృద్ధికే**

# ఆక్వా జోన్ ఏర్పాటు

**జిల్లాలో ఆక్వాజోన్ కొరకు ప్రతిపాదనలు అమోదం తెలిపిన కమిటీ : కలెక్టర్**



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: ఆక్వా రైతుల సుస్థిర అభివృద్ధి కొరకే ఆక్వాజోన్ ఏర్పాటు చేయడం జరుగు తుందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహించడం కొరకు ఆక్వా కల్చర్ జోన్లను ఏర్పాటు చేయడం ద్వారా ఆక్వా పరిశ్రమను వృద్ధిలోకి తెచ్చేందుకు కృషి జరుగుతుందన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన తిరుపతి నూతన జిల్లా మొదటి జిల్లాస్థాయి ఆక్వాజోన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత కమిటీ సభ్యులైన కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ వైజాగ్ ప్రతినిధి జ్ఞానవేల్, ఎంపెడా ఎ.డి. అరవిక్కరసు, ఎస్వీ యూనివర్శిటీ ఆక్వా డిపార్టుమెంట్ హెచ్ ఓ డి నాగజ్యోతి, ప్రోగ్రెసివ్ ఫిష్ ఆక్వా రైతులు, మత్స్యశాఖ అధికారులు, ఆర్జీకే, మత్స్యశాఖ సిబ్బందితో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆక్వా కల్చర్ జోన్లను నోటిఫై చేయుటకు నిబంధనల మేరకు రెవెన్యూ విలేజ్‌ల వారీగా ఆక్వా కల్చర్ సాగు చేస్తున్న ప్రాంతా లను గుర్తించి వాటి జియో కో ఆర్డినేట్‌లు మ్యాపింగ్ చేసి, వాటిని బ్రాకిష్ వాటర్, ఫ్రెష్ వాటర్ ప్రాంతాలుగా నోటిఫై చేసేలా చర్యలు ఉండాలన్నారు. 10 ఎకరాల లోపు మత్స్య, ఆక్వా కల్చర్ కుంటలను ఎపిఎస్ఎడిడిఎ ఆక్ట్ 2020 కింద రిజిస్ట్రర్ నమోదై, నిర్వహిస్తున్న రైతులకు సబ్సీడితో యూనిట్‌కి రూ.1.50, 10ఎకరాలపైన వాటికి రూ.3.85 ఒక యూనిట్‌కి వసూలుకి నిబంధనల మేరకు చర్యలు ఉండాలని సూచించారు.

# నిరాధరణే కారణమా?

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ప్రజారాజ్యం పార్టీ తరఫున శాసనసభ్యుడుగా పోటీ చేసిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నియోజకవర్గ ప్రజలకు సుపరిచయస్తులు. తరువాత రాజకీయ మార్పులతో డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీకి దగ్గరయ్యారు. తాను నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయినా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆదుకున్నారు. శ్రీకాళహస్తి నివాసి అయిన డాక్టర్ సుబ్రమణ్యం తిరుపతిలో డాక్టర్‌గా స్థిర పడ్డారు. అయితే శ్రీకాళహస్తి నుంచి ఎవరు పోయినా నేనున్నానని సుబ్రమణ్యం అందుబాటులో ఉన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఓ ప్రధాన సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తమ సామాజిక వర్గంతో సన్నిహితంగా ఉన్నారు. ఆయన పోటీ చేసినపుడు ఎందరు అయనతో సన్నిహితంగా ఉంటూ ఎన్నికలు జరిపిన వారు కూడా మోసం చేసారు. 2009లో డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేసారు. ఆ ఎన్నికల్లో గోపాలకృష్ణారెడ్డి తో పోటీ చేయగా 24349 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన గోపాల కృష్ణారెడ్డికి 70,707 ఓట్లు వచ్చాయి. ఓడిపోయినా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నిరాశ చెందలేదు. ఆశావాదిగా అవకాశం వస్తుందా? అని ఆశించారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం రాష్ట్ర స్థాయి కార్యదర్శి పదవి ప్రకటించి చేతులు దులుపు కున్నారు. అధినాయకత్వం కూడా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సేవల్ని ఉపయోగించుకుంటున్నారా? లేదా? అని పరిశీలించుకునే పరిస్థితి లేదు. ఇక కుప్పంలో యువగళం పాదయాత్రకు ముందుకు వచ్చిన లోకేష్‌కు అండగా నిలిచారు.

**వారంలో ఏం జరిగింది?**

తెలుగుదేశం ఏ కార్యక్రమాలు నిర్వహించినా హాజరయ్యే సిపాయి సుబ్రమణ్యం క్రమశిక్షణ కల్గిన కార్యకర్తగా పాల్గొనే వారు. కుప్పంలో జరిగిన లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హఠాత్తుగా పార్టీకి రాజీనామ చేయటంలో ఏం జరిగిందనేది శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. అయితే పార్టీ వర్గాల్లో డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం రాజీనామా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన సన్నిహితులు మాత్రం తిరుపతిలోనూ, శ్రీకాళహస్తినియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలకు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను పిలిచే వారు కాదని కుములుతున్నారు. పెట్టుబడి ఆయనే పెట్టినా పార్టీ పట్టించుకునే వారు కాదనే అసంతృప్తి చోటు చేసుకుంది. హఠాత్తుగా తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకు అధికార పార్టీ గాలం వేసిందనే చర్చ సాగుతుంది. అందరితో సన్నిహిత సంబందాలు కల్గి ఉన్న నాయకుడు. ఇటీవల తెలుగుదేశం పార్టీ నాయకులు వన్నెకుల క్షత్రియ వర్గానికి చెందిన మాజీ ఎంఎల్‌ఏ సత్రవాడ మునిరామయ్యను పార్టీలో చేర్చుకున్నారు. దాంతో వారికి షాక్ ఇవ్వటానికి అదే సామాజిక వర్గానికి చెందిన ఆ వర్గంతో సన్నిహిత సంబందాలు కల్గిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకు పదవి గాలం వేసినట్లు చర్చించుకుంటున్నారు.

**బిసిలకు సముచిత స్థానం లేనందునే**

# టిడిపికి రాజీనామా!

**-రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా॥సిపాయి సుబ్రహ్మణ్యం**



తిరుపతి ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: బిసిలంటేనే టిడిపి..టిడిపి అంటేనే బిసిల పార్టీ అని స్లోగన్‌లు ఇచ్చుకోవడమే తప్ప ఆ పార్టీలో ఎక్కడా బిసి నేతలకు సముచిత స్థానం, గౌరవం లేనందునే నేడు తాను రాజీనామాకు సిద్ధపడ్డానని ఇప్పటి వరకు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పనిచేసిన డా॥సిపాయి సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో ఇందిరాగాంధీ నాయకత్వంలో దశాబ్దాల పాటు బిసిలకు కరివేపాకులా వాడుకున్నారు తప్ప వారికి ఏ విధంగాను లబ్ధి చేకూర్చలేదన్నారు. 1983లో స్వర్గీయ నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రి అయిన తరువాతే బిసిలకంటూ గుర్తింపు, గౌరవం లభించిందన్నారు. తరువాత 2009లో చిరంజీవి స్థాపించిన పిఆర్‌పి పార్టీ తరపున బిసిలకు 100 సీట్లు కేటాయించిందన్నారు. అలాగే ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన బిసిల రాజకీయ సాధికారత అనే మూల సిద్ధాంతాన్ని చంద్రబాబు ముందుకు తీసుకెళ్లలేక పోయారన్నారు. బిసిలు బలంగా ఉన్న చోట్ల కూడా వారికి తూతూమంత్రంగా ఎమ్మెల్యే టికెట్లు ఇస్తున్నారు. ఈ ధోరణి 2024లో కూడా కొనసాగుతుందనే అనుమానంతో తాను పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు.

# దశల వారీగా కార్మికుల సమస్యలు పరిష్కారం

**- మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ**

**చిత్తూరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్య కార్మికుల సమస్యలను దశల వారీగా పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటామని కమీషనర్ డాక్టర్ జె.అరుణ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరాహారదీక్ష శిబిరం వద్దకు బుధవారం కమీషనర్ వెళ్ళి వాళ్ళతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు తదితరాల కోసం ఇప్పటికే పలు మార్లు టెండర్లు పిలిచామని ప్రత్యామ్నాయంగా జగనన్న మార్టుల



ద్వారా అందించడానికి చర్యలు తీసుకొంటామని చెప్పారు. పారిశుధ్య కార్మికుల కోసం ఈఎస్ఐ కార్డులు సిద్ధం చేశామన్నారు. నగర పరిధిలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలమన్నారు. అలాగే వారి ఆరోగ్యం, ఇతర సమస్యల పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. దీక్ష శిబిరం వద్దకు కమీషనర్ వచ్చి కార్మికులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## చేయి చేయి కలిపారు...స్నేహమంటే ఇదేరానిపించారు...!

**చౌడేపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



మరణించిన స్నేహితుడి కుటుంబానికి ఆసరాగా నిలచి స్నేహమంటే ఇదేరా అనిపించారు...కొడుకుని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో వున్న ఆతల్లికి మేమున్నామని భరోసాగా నిలచారు...మండలంలోని పరికిదొన పంచాయతీ మదుకూరుకు చెందిన వెంకట్రమణ స్థానిక ఉన్నతపాఠశాలలో 1987-88లో 10వ తరగతి చదివాడు. కరోనా వ్యాప్తి విజృంభనలో అతను అశువులు బాసాడు. పోషకుడు మంరణించడంతో కుటుంబం రోడ్డున పడింది. గుర్తించిన స్నేహితులు(1987-88) మృతుని తల్లి వెంకటలక్ష్మికి బాసటగా నిలవాలనుకొని చేయి చేయి కలుపుకొని రూ. 36వేలు, నిత్యావసర సరుకులు సమకూర్చారు. స్నేహితున్ని కోల్పోయి రెండేళ్ళవుతున్నా గుర్తుంచుకొని ఆ కుటుంబానికి కొండంత బలంగా నిలచి స్నేహమంటేఇదేఅనిపించిన1987-88 పూర్వపు విద్యార్థుల స్నేహబంధాన్ని గ్రామస్తులు కొనియా డారు.

## వేలం పాటద్వారా రూ. 1.70కోట్ల ఆదాయం

**-రికార్డుస్థాయిలో పెరుగుదల**

**బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ వేలం పాట ,ద్వారా రూ. 1,70,24,116లు ఆదా ,యంగా వచ్చినట్లు ఆలయ ఛేర్మన్ మిద్దింటి శంకరనా ,రాయణ, ఇఓ చంద్ర ,మౌళిలు తెలిపారు. అమ్మవారి ఆల ,,,యంలో వివిధ వనరులకు నిర్వహించిన వేలం పాటలో గతంతో పోల్చితే రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. కొబ్బరికాయలను సంవత్సర కాలంపాటు విక్రయించుకొనే హక్కును నవీన్కుమార్ రూ. 44.18లక్షలు హెచ్చుగా పాడి దక్కించుకొన్నాడు. హారములు వగైరాలు విక్రయించుకొనే హక్కును రఘుపతినాయుడు రూ. 35.00.116లు, చీరలు సేకరించుకొనే హక్కును లలితమ్మ రూ. 18.04లక్షలు, పెద్దభోగము శుభ్రపరచి ఇచ్చు హక్కును సురేష్బాబు రూ. 50.01లక్షలు, కోళ్ళు విక్రయించుకొనే హక్కును రమణ రూ. 23.01లక్షలు హెచ్చుగా పాడి దక్కించుకొన్నారు. గత సంవత్సరంతోపా పోల్చితే ఆదఫా రూ. 77,44,116హెచ్చుగా ఆలయానికి ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు వెంకట్రమణారెడ్డి, పూర్ణిమారాయల్మోహన్, ఇన్స్పెక్టర్ శశికుమార్, అధికార, అర్చక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## లాడ్జీపై పోలీసుల మెరుపుదాడి.. ముగ్గురు నిర్వాహకులు.. విటుడు అరెస్ట్

**కుప్పం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

కుప్పం - గుడుపల్లె ప్రధాన మార్గంలో ఉన్న వరద లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు అర్బన్ సిఐ శ్రీధర్ పోలీసులతో లాడ్జీపై మెరుపుదాడి నిర్వహించారు. ఈసందర్బంగా ఓ విటుడితో పాటు ముగ్గురు నిర్వాహకులను అరెస్ట్ చేసారు. ఈసంఘటనకు సంబంధించి అర్బన్ సిఐ శ్రీధర్ తెలిపిన మేరకు వివరాలిలా.. శ్రీనివాసులు అనే వ్యక్తి గుడుపల్లె మార్గంలో వరద లాడ్జి నిర్వహిస్తున్నాడన్నారు. తన లాడ్జిలో పనిచేసే రాజశేఖర్, మురుగేష్ల ద్వారా తమిళనాడు రాష్ట్రం వరటనపల్లికి చెందిన వడివేలు సహకారంతో బెంగళూరు, కృష్ణగిరి ప్రాంతాల నుంచి యువతులను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నారని తమకు సమాచారం అందిందన్నారు. దీంతో బుధవారం ఉదయం పలమనేరు డిఎస్పీ సుధాకర్రెడ్డి ఆదేశాలతో తాము లాడ్జిపై దాడులు నిర్వహించామన్నారు. ఈసందర్భంగా ముగ్గురు నిర్వాహకులతో పాటు విటుడు బాలాజీ అనే వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు. కార్యక్రమంలో గుడుపల్లె ఎస్సై రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శైవక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలి

**- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్**

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



మహాశివరాత్రి పండగ సందర్భంగా కుప్పం నుంచి వివిధ ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. కుప్పం నుంచి శ్రీశైలం, శ్రీకాళహస్తితో పాటు గుడుపల్లె మండలం మల్లప్ప కొండకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను నడపాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ సూచనల మేరకు బుధవారం కుప్పం ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ లక్ష్మీదేవికి మున్సిపల్ కౌన్సిలర్లు మోహన్రాం, విజయ్కుమార్లు వినతిపత్రం అందించారు. విషయంను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సూపరింటిండెంట్ తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఐసిడిఎస్ ఆధార్ క్యాంపు విజయవంతం

**గుడిపాల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**

మండలంలోని తుమ్మలవారిపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆధార్ క్యాంపు విజయవంతం అయ్యింది. ఈ కార్యక్రమంలో 52 మంది చిన్నపిల్లలు ఆధార్ నమోదు చేసుకొన్నారు. ఈ క్యాంపును సిడిపిఓ శ్యామ్, సుగుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ ప్రతి ఒక్కరికి తప్పనిసరి అని, చిన్న పిల్లలు సైతం ఆధార్ను కచ్చితంగా పొందాల్సి వుంటుందని స్పష్టం చేశారు. అనంతరం ఆమె గొల్లమడుగు అంగన్వాడీ కేంద్రంను పరిశీలించి గర్భవతులు, బాలింతలకు అందిస్తున్న ఆహారంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు లావణ్య, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

**- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు**

**బంగారుపాళ్యం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని స్వయంభూశ్రీమొగిలీశ్వరాలయంలో ఘనంగా ఏర్పాట్లు చేపట్టాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం మొగిలీశ్వరాలయ ఆవరణలో శివరాత్రి ఉత్సవాలపై ఎమ్మెల్యే అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం రోజు అధిక సంఖ్యలో భక్తులు ఆలయంకు విచ్చేస్తారన్నారు. భక్తులకు మంచినీటి వసతి, క్యాలైన్లు తదితర మౌళిక వసతులు ఆలయ అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. శివరాత్రి రోజు ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు స్థానికులు స్వామి వారిని దర్శించుకొనే విధంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆలయంను సుందరంగా విద్యుత్దీపాలంకరణతో అలంకరించాలన్నారు. వాహనాల నిలుపుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్రాజా, ఆలయ ఇఓ మునిరాజు, స్థానిక ఎస్ఐ మల్లికార్జున్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యంగా మధ్యాహ్న భోజనం

**చిత్తూరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**

పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యంగా వుండాలని కమీషనర్ డాక్టర్ జె.అరుణ స్పష్టం చేశారు. కట్టమంచి నగర పాలిక సంస్థ ఉన్నత పాఠశాలను బుధవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ తనిఖీ చేశారు. విద్యార్థుల మధ్యాహ్న మెనును పరిశీలించిన కమీషనర్ ఆపై విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా రోజు మధ్యాహ్న భోజనం ఇలాగే పెడ్తారా! కోడిగ్రుడ్లు పెడుతున్నారా! అని విద్యార్థులను కమీషనర్ ఆరా తీశారు. ఆపై కమీషనర్ ఆన్లైన్ హాజరును తనిఖీ చేసి ఉపాధ్యాయులతో మాట్లాడుతూ టెన్త్ పరీక్షలను పాఠశాల విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ సెల్వరాజ్, సిఎంఎం గోపి, పాఠశాల హెడ్మాస్టర్, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మస్తానమ్మకు నారా లోకేష్ నాలుగు చక్రాల బండి వితరణ

**కాణిపాకం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**



కొబ్బరికాయలు అమ్ముకుని జీవించే మస్తానమ్మ కోరిక మేరకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు నాలుగు చక్రాల బండిని స్థానిక టీడీపీ నాయకుల ద్వారా బుధవారం అందించారు. వివరాలిలావున్నాయి. యువగళం పాదయాత్ర సందర్భంగా కాణిపాకం విచ్చేసిన నారా లోకేష్ స్థానికంగా కొబ్బరి కాయలు వ్యాపారం చేసుకుంటున్న మస్తానమ్మ వద్ద కొబ్బరినీరు సేవించిన ప్రతిఫలంగా ఏమి కావాలని కోరారు. అందుకు తనకు టెంకాయలు పెట్టుకుని విక్రయించుకోవడానికి నాలుగు చక్రాల బండి కావాలని తెలిపారు. ఆమె కోరికను మన్నించిన నారా లోకేష్ సుమారు 20 వేల రూపాయలు విలువగల నాలుగు చక్రాల బండిని స్థానిక టీడీపీ నాయకులు చేతుల మీదుగా మస్తానమ్మకు విరాళంగా అందించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లారపల్లె గిరిధర్నాయుడు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, నాయకులు మధుసూదన్నాయుడు, బాబునాయుడు, నరసింహులునాయుడు, సునీల్ చౌదరి, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## రోజమ్మా.. నీకు రాజకీయ బిక్ష పెట్టింది చంద్రబాబే - తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ

**- నారా లోకేష్ను విమర్శించే అర్హత లేదు .. ఐరన్ లెగ్ నువ్వే !!**

**కుప్పం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

మంత్రి రోజాకు రాజకీయ బిక్ష పెట్టింది తెదేపా అధినేత చంద్రబాబునాయుడేననే విషయం ప్రజలందరికీ తెలుసని కుప్పం నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ పేర్కొన్నారు.బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ను విమర్శించే అర్హత మంత్రి రోజాకు లేదన్నారు. తెదేపా అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేష్లకు చీర, సారె పంపుతామన్న రోజాకు చీర, సారె కట్టుకున్న వారు అంటే అంత చులకనా అని ప్రశ్నించారు. మహిళలు కట్టుకునే చీర, సారెల గురించి రోజా మాట్లాడడం తగదన్నారు. రాష్ట్రానికి ఏదో



అభివృద్ధి చేస్తారని మంత్రి పదవి ఇస్తే విలాసాలు చేస్తూ కాలం గడుపుతున్నారన్నారు. ఎవరో ప్రజలకు తెలుసన్నారు. తెదేపాలో ఓనమాలు నేర్చుకున్నావనే విషయం మరచిపోవద్దన్నారు. రోజా ఐరన్లెగ్ అని విమర్శించారు. కాంగ్రెస్లో అడుగుపెట్టగానే వైఎస్ రాజశేఖరరెడ్డి మృతి చెందారన్నారు. మహిళలను జైల్లో పెట్టించిన రోజాకు ముమ్ముందు మహిళలే గుణపాఠం చెబుతారన్నారు. జిల్లా మహిళా నాయకురాలు చంద్రకళ మాట్లాడుతూ మంత్రి రోజా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. రోజాకు నారా లోకేష్లకు మధ్య తేడా నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. మంత్రి రోజా మరోమారు నోరు జారితే నాలుక చీల్చుతామని హెచ్చరించారు. సమావేశంలో తెలుగు మహిళ నేతలు వసంతమ్మ, సుగుణమ్మ, స్వాతి, యశోదమ్మ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఘనంగా షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం

**వెంకటగిరి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**



పట్టణంలోని ఆత్మ మాలిక్ ధ్యాన పీఠం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి20అడుగుల విగ్రహానికి పూజలు చేసి ప్రారంభించారు.నూతనంగనిర్మించిన వల్లి దేవసేన షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామిఆలయాన్నికూడా శాస్త్రోపేతంగా ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు 108 కలిశాలకు పూజలు నిర్వహించారు. వల్లి దేవసేన షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలు జరిపారు.

## వెంకటగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**- వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్కుమార్రెడ్డి**

**వెంకటగిరి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**



వెంకటగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్కుమార్రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో చైర్పర్సన్ నక్కా భానుప్రియ, వైస్చైర్పర్సన్ ఉమా మహేశ్వరి, పలువురు కౌన్సిలర్లు, పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అందరి సహకారంతో పట్టణాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఇప్పటికే వెంకటగిరి, ఏర్పేడు కలిసిపోతున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రమైన తిరుపతికి వెంకటగిరి అతి సమీపంలో ఉందన్నారు. పట్టణ అభివృద్ధికి కౌన్సిలర్లతో చర్చిస్తానని తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, న్యాయవాదుల సంఘం కార్యదర్శి లక్కమనేని కోటేశ్వరరావు, కౌన్సిలర్లు పూజారి లక్ష్మీ, నారి శేఖర్, కందటి కళ్యాణి, గోపాలకృష్ణ, విజయలక్ష్మీ తదితరులు ఆయనను కలిశారు. ఆయన వెంట వైసీపీ నాయకులు శంకర్రెడ్డి, దశరథరామిరెడ్డి, ఢిల్లీ బాబు తదితరులు ఉన్నారు.

## ఘనంగా నానాజి జన్మదిన వేడుకలు

**చిల్లకూరు ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



స్థానిక చిల్లకూరులోని జాతీయ రహదారిపక్కన వున్న జ్యోతి వే బ్రిడ్జి వద్ద బుధవారంప్రముఖ పారిశ్రామికవేత్త పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ యువనాయకులు తానంకి నానాజి (47) జన్మదిన వేడుకలు యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీపూలమాల కేకును కట్ చేసి అందరికి పంచి పెట్టారు.అనంతరం నానాజికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 50మంది యువత ఉచితంగా రక్తదానం చేయడం జరిగింది.మధ్యహ్నం భారీ అన్నదాన కార్యక్రమాన్నినిర్వహించారు.తానంకిరామకృష్ణా, తానంకి సతీష్,చిల్లకూరుపట్టాభిరామిరెడ్డి,బెల్లంకొండ మల్లికార్జున్, సోమశేఖర్,పురుషోత్తమ్,సాయి,చేజర్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఇఓ

**దొరవారిసత్రం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



దొరవారిసత్రం మండలం తల్లంపాడు ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఎంఇఓ దారా మస్తానయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ వడిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటలు రుచి చూశారు. వంట నిర్వాహకులతో మాట్లాడుతూ భోజనం నాణ్యతగా చేయాలన్నారు. ఎంఇఓతో పాటు ప్రధానోపాధ్యాయుడు హుసేనయ్య, టీచర్ శ్రీనివాసులు ఉన్నారు.

## గూడూరు లయన్స్క్లబ్ సేవలు ప్రశంసనీయం

**- లయన్స్ జిల్లా గవర్నర్ లయన్ రామచంద్రప్రకాష్రావు**

**· గూడూరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

గూడూరు లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని లయన్స్ జిల్లా గవర్నర్ రామచంద్ర ప్రకాష్రావు పేర్కొన్నారు. అధికారిక పర్యటన నిమిత్తం గూడూరు లయన్స్ క్లబ్ వారిచే నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో బుధవారం పాల్గొన్నారు. ముందుగా జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను సందర్శించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. లయన్స్ క్లబ్ గూడూరు వారు సమకూర్చిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మెటీరియల్స్ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్కు అందజేశారు. అనంతతరం సరస్వతీ శిశుమందిరంలో నిరుపేదలకు ఫల సరుకులు, పేదలకు చీరలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ద్వారా నిర్వహిస్తున్న



కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి అక్కడ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. గూడూరు రెండో పట్టణంలో ఉన్న బాలసదన్ లయన్స్క్లబ్ వారు సమకూర్చిన గీజర్ను వార్డెన్కు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ గవర్నర్ రామచంద్ర ప్రకాష్ మాట్లాడుతూ గూడూరు లయన్స్క్లబ్ గత 55 సంత్సరాల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించే సీనియర్ క్లబ్ అని, క్లబ్ ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలను ప్రవంసించారు. ఆయన వెంట అధ్యక్షులు కల్యాణసాయి, డిస్ట్రిక్ట్ ఛైర్మన్లు షేక్ రియాజ్ అహ్మద్, మురళీరెడ్డి, రామ్మోహన్, రీజనల్ ఛైర్మన్ శ్రీరాములు, జోన్ ఛైర్మన్ కామాక్షి, లయన్స్ సభ్యులు రూపేష్రెడ్డి, రవిచంద్రారెడ్డి, మదనమేటి రమణయ్య, ఇషాక్, మునికుమార్, దయాల్, రవీంద్రకుమార్, రామచంరదయ్య, సోమిశెట్టి చెంచురామయ్య, జడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే హాస్పిటల్లో ఉచిత వైద్యశిబిరం

**· గూడూరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



గూడూరు రైల్వే హాస్పిటల్లో సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డిఆర్యుసిసి మెంబర్ రొటేరియన్ డాక్టర్ బి.శ్యామసుందర రావు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. నెల్లూరు మెడికవర్ వైద్యులు, కార్డియాలజిస్ట్ డాక్టర్ జయరామ్, జనరల్ మెడిసిన్ డాక్టర్ ఎస్కె ఫిరోజ్, ధాత్రి హాస్పిటల్ నెల్లూరు ఊపిరితిత్తుల డాక్టర్ పి.దిలీప్కుమార్, గర్భకోశ నిపుణునాలు కె.వేదవల్లి వాణిశ్రీ తదితరులు సుమారు 140 మంది రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సూచనలు సలహాలిచ్చారు. బిపి, షుగర్, ఈసీజీ, గర్భకోశ, ఊపిరితిత్తుల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు రైల్వే డాక్టర్ శ్రీనివాస్ సుందరకుమార్, డిఆర్యుసిసి మెంబర్ డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్, మెడికవర్ సిబ్బంది, ధాత్రి ఆసుపత్రి సిబ్బంది, రైల్వే మెడికల్ స్టాఫ్, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

## కుతూహలమ్మ మృతదేహానికి నివాళులు

**పాలసముద్రం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బుధవారం మృతి చెందిన మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ మృతదేహానికి జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం సమన్వయకర్త భీమినేని చిట్టిబాబు నివాళులు అర్పించారు. తిరుపతిలోని గుమ్మడి కుతూహలమ్మ నివాసంలో వుంచి ఆమె పార్థీవ దేహంకు పూలమాల వేసిన అనంతరం చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతను కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జ్యోతీశ్వరరెడ్డి, తెలుగు యువత నాయకులు శ్రీధర్యాదవ్, ఎస్సీ నాయకులు దేవసుందరం, గండయ్య, బాలాజీనాయుడు, బీగాల రమేష్, ఎం.శేఖర్రాజు, కుప్పయ్య, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

## డిల్లీ ఎసీఈఆర్టీ బృందంచే మాడల్ పాఠశాల పరిశీలన

**యర్రావారిపాలెం,ఫిబ్రవరి15ప్రభాతవార్త**



తిరుపతి జిల్లాలోని యర్రావారిపాలెం మండలంలోని ఏపీ మోడల్ స్కూలును బుధవారం సందర్శించింది. పాఠశాలలో అమలు అవుతున్న వివిధ కార్యక్రమాలు గురించి కళాశాల ప్రిన్సిపాల శ్రీదేవి వారికి వివరించారు.ప్రభుత్వం అమలుచే స్తున్న బైజ్యూస ట్యాబ్లను విద్యార్థులు ఉపయోగించే విధానమును చూసి అభినందించారు. బృందం అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు చక్కగా సమాధానాలు ఇచ్చారు. అనంతరం పాఠశాలలోని గ్రంథాలయం ,సైన్స్ ల్యాబ్, అటల్ టింకరింగ్,జగనన్నగోరుముద్ద, జగనన్న విద్యాకానుక, పరీక్ష విధానము,పాఠశాల వాతావరణం, సాంస్కృతిక కార్యక్రమాలు,వసతిగృహం భోజనం,వసతి సౌకర్యాఉలు పరిశీలించారు. అన్ని బాగున్నాయనిఅభినందించారు. కార్యక్రమంలో డీఈఓ శేఖర్,జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు,సీఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మెన ,సిబ్బంది పాల్గొన్నారు.

## బస్సు ద్విచక్రవాహనం ఢీ ఒకరికి గాయాలు.

**బైరెడ్డిపల్లి ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని పుంగనూరు బైరెడ్డిపల్లి రహదారిలో ఆకులకొత్తూరు మలుపువద్ద ఆర్టీసీబస్సు ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది.స్థానికుల కథనం మేరకు వివరాలిలా పెద్దపంజాణి మండలం బట్టందొడ్డి పంచాయతీ పరిధిలోని కురపల్లి గ్రామానికి చెందిన శివకుమార్(32) బైరెడ్డిపల్లి నుండి స్వంత గ్రామం కురపల్లికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీబస్సు ఆకులకొత్తూరు సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో ఈప్రమాదం చోటుచేకుందన్నారు.ప్రమాదంలో గాయపడిన శివకుమార్ను 108సిబ్బంది,స్థానికుల సహాయంతో బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.మెరుగైన

## ముఖ్యమంత్రిపై అవాకులు చవాకులు మాట్లాడితే సహించేది లేదు

**· గూడూరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

ఇటీవల కాలంలో మైనారిటీ సంస్థ ముసుగులో ఫారూఖ్ షబిలీ ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని విమర్శించారని, అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని వైసీపీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ మగ్దూమ్ అన్నారు. గూడూరులోని షాదీమంజిల్లో బుధవారం తిరుపతి జిల్లా వక్ఫ్బోర్డ్ ఉపాధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ గఫూర్ ఆధ్వర్యంలో వైసీపీ మైనారిటీ నాయకుల మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షబిలీ బుద్ధిగా ఉండాలని, టీడీపీకి విధేయుడిగా ఉంటే ఉండాలని, తమ నాయకుడు జగన్ జోలికొస్తే సహించేది లేదన్నారు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్ర పాదయాత్ర సజావుగా చేసుకొని ప్రజల మనసు గెలిచే ప్రయత్నం చేయాలని, మీరు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేశారో చెప్పి ఓట్లు అడగాలని, అది వదిలేసి



ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డిని కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. వక్ఫ్బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ గఫూర్ మాట్లాడుతూ ఫారూఖ్ షబిలీ పక్కా టీడీపీ కార్యకర్త అని, ఏదో చంద్రబాబు భజన చేసుకుంటూ లేనిపోని అభాండాలు ప్రభుత్వం మీద వేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. వైసీపీ యువ నాయకులు, ఈద్గా యూత్ అధ్యక్షుడు షబ్బీర్ మాట్లాడుతూ గడచిన తెలుగుదేశం ప్రభుత్వంలో మీ పాలనలో మైనారిటీలకు మీరు చేసిన మేలు ఏమీ లేదని, నారా హమారా కార్యక్రమంలో మీరు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్లకార్డుల ద్వారా అడిగినందుకు వారి మీద దేశద్రోహం కేసు పెట్టిన చరిత్ర మీది కాదా అని ప్రశ్నించారు. వైసీపీ మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.జలీల్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ ప్రజలందరూ నేడు సుభిక్షంగా సంతోషంగా ఉన్నారంటే అది వైఎస్ జగన్మోహన్రెడ్డి కారణంగానే అని చెప్పారు. తమ నాయకుడు జగన్పై లేనిపోని అభాండాలు వేస్తే సహించబోమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్, జిల్లా వక్ఫ్బోర్డు ఉపాధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ గఫూర్, గోల్డ్ నాజర్, ఈద్గా యూత్ అధ్యక్షుడు షబ్బీర్, బాబు, బిఎస్ఎన్ఎల్ యస్దాని, మైనారిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జలీల్, ఈద్గా యూత్ యస్దాన్, నజీర్, ఫారూఖ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

